క్లుప్తంగా

విద్యార్థులకు 45 సైకిళ్లు అందజేత

చీమకుర్తి రూరల్: మండలంలోని పల్లామల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు 45 సైకిళ్లను ఏపీ మిడ్‌వెస్ట్ యాజమాన్యం రాఘవరెడ్డి రాము సమకూర్చగా స్థానిక ఎమ్మెల్యే బీఎన్ విజయకుమార్ అందజేశారు. కార్యక్రమంలో ఏపీ మిడ్‌వెస్ట్ మేనేజర్ అంబటి శ్రీనివాసరావు, ఏపీఎండీసీ డైరెక్టర్ నతానేల్, ఎంఈఓ శివాజీ, ఎంఆర్‌ఓ బ్రహ్మయ్య జి.రాఘవరావు మన్నం ప్రసాదు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ క్యాడెట్ల స్వచ్ఛ భారత్



చెత్తా, చెదారాలను శభ్రం చేస్తున్న ఎన్‌సీసీ క్యాడెట్లు

ఒంగోలు సిటీ: ప్రపంచ ధరిత్రి దినోత్సవం సందర్భంగా ఒంగోలులోని క్విస్ ఇంజినీరింగ్ కళాశాల ఎన్‌సీసీ క్యాడెట్లు స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. మంగళవారం ఎన్‌సీసీ క్యాడెట్లు కళాశాల సమీపంలోని కొన్ని ప్రాంతాలను శుభ్రం చేశారు. చెత్తా, చెదారాలను ఏరి మొక్కలు నాటారు. అనంతరం భూమిని, పర్యావరణాన్ని కాపాడాలని ప్రతిజ్ఞ చేసి అవగాహన కల్పించారు. విద్యాసంస్థల అధినేత డాక్టర్ సూర్య కల్యాణ్ చక్రవర్తి, ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ డాక్టర్ గాయత్రి మాట్లాడుతూ.. భూమిని కాపాడుకోవడం మనందరి బాధ్యతన్నారు. ప్రతిఒక్కరూ పర్యావరణాన్ని కాపాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ ఇన్‌చార్జి డాక్టర్ వాసుబాబు, శిక్షకుడు రమణయ్య, క్యాడెట్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

అనాథాశ్రమానికి నిత్యావసరాలు పంపిణీ



నిత్యవసరాలు పంపిణీ చేస్తున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కల్యాణ్ చక్రవర్తి

ఒంగోలు సిటీ: భారతీయ జనతా పార్టీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షురాలు, ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి పుట్టిన రోజు సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ నిడమానూరి సూర్య కల్యాణ్ చక్రవర్తి ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. మంగళవారం పట్టణంలోని భాగ్యనగర్ హౌసింగ్ బోర్డు కాలనిలోని బొమ్మరిల్లు అనాథాశ్రామానికి రూ.10 వేల విలువగల నిత్యావసరాలు పంపిణీ చేశారు. అనంతరం రామ్‌నగర్ 3వ రోడ్డులోని బాలసదన్‌లో అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు సేగ్గం శ్రీనివాసరావు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

చంటి బిడ్డలకు పాలిచ్చే గది ప్రారంభం

ఒంగోలు సబర్బన్: ప్రకాశం భవన్‌లో చంటి బిడ్డలకు పాలిచ్చే గదిని మంగళవారం రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖామంత్రి మంత్రి డాక్టర్ బాల వీరాంజనేయ స్వామి ప్రారంభించారు. మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో ప్రత్యేకంగా చంటి బిడ్డలకు తల్లులు పాలిచ్చు గదిని ఏర్పాటు చేశారు. కలెక్టరేట్‌లో ఈ గదిని ఏర్పాటు చేయటం చంటి బిడ్డల తల్లులకు ఎంతో ప్రయోజనకరమన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ తమీమ్ అన్సారియాను మంత్రి స్వామి ప్రత్యేకంగా అభినందించారు. ఫొటో ప్రదర్శనను మంత్రి తిలకించారు. నగర మేయర్ గంగాడ సుజాత, జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ పాల్గొన్నారు.

పొగాకు రైతులను ఆదుకుంటాం

పొగాకు రైతులను అన్ని విధాలా ఆదుకుంటామని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి అన్నారు. మంగళవారం ఒంగోలులోని పేర్నమిట్ట వద్ద ఉన్న ఒంగోలు–1 పొగాకు వేలం కేంద్రాన్ని సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్ విజయకుమార్‌తో కలిసి ఆయన సందర్శించారు. పొగాకు బోర్డు ఆర్‌ఎం లక్ష్మణరావు, వేలం కేంద్రం అధికారులు, పొగాకు రైతులు పాల్గొన్నారు.

జాతీయ రెజ్లింగ్ పోటీలకు చీమకుర్తి క్రీడాకారుడు



క్రీడాకారుడిని అభినందిస్తున్న సీఐ సుబ్బారావు

చీమకుర్తి: జాతీయ స్థాయి రెజ్లింగ్ పోటీలకు చీమకుర్తి క్రీడాకారుడు కన్నెబోయిన శ్రీహరి ఎంపికైనట్లు కోచ్ ఉమామహేశ్వరరావు తెలిపారు. ఈనెల 22 నుంచి 28 వరకు స్కూలు గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఢిల్లీలో నిర్వహించే పోటీల్లో శ్రీహరి పాల్గొంటాడని తెలిపారు. ఈ సందర్భంగా శ్రీహరిని, కోచ్‌ను స్థానిక చీమకుర్తి సీఐ ఎం.సుబ్బారావుతో పాటు డాక్టర్ బీ.జవహర్, పూనాటి వెంకట్రావు అభినందించారు.

పారిశుద్ధ్యం.. ఆమడ దూరం

- ఎంపీడీఓ కార్యాలయం వద్ద మురుగు నీరు ముందుకు కదలక అవస్థలు
- ఊరిచివర మొక్కుబడిగా పారిశుద్ధ్య పనులు
- ప్రబలుతున్న విషజ్వరాలు, డయేరియా



సంతనూతలపాడులో ఊరి చివర స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ నిర్వహించిన దృశ్యం



ఎంపీడీఓ ఆఫీసుకు కూతవేటు దూరంలో చెరువును తలపిస్తున్న కాలువలో మురుగు

సంతనూతలపాడు: మండల కేంద్రంలో పారిశుద్ధ్యం పడకేసింది. ఎక్కడ చూసినా అపరిశుభ్రత నెలకొంది. డ్రైనేజీల్లో మురుగునీరు ముందుకు కదలడంలేదు. దీనికితోడు దోమల బెడద అధికంగా ఉంది. దీంతో ప్రజలు విషజ్వరాలు, డయేరియా బారిన పడి ఆస్పత్రి పాలవుతున్నారు. వీధుల్లో అనేక చోట్ల డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేక మురుగునీరు రోడ్లపై పారుతూ దుర్వాసన వెదజల్లుతోంది. అనేక ఏరియాల్లోని ప్రధాన డ్రైనేజీల్లో మురుగునీరు ముందుకు సాగడం లేదు. ఇంకా కొన్ని చోట్ల ఖాళీ స్థలాల్లో మురుగునీరు నిల్వ ఉండి చెరువులను తలపిస్తున్నాయి. ఫాగింగ్ మిషన్ జాడే లేదు. సీజనల్ వ్యాధులు ప్రబలే సమయంలో పారిశుద్ధ్యం మెరుగుకు చర్యలు తీసుకోవాల్సిన అధికారులు చేతులెత్తేశారు. కొన్ని రోజులుగా పడిన వర్షాలకు ఎంపీడీఓ ఆఫీసుకు కూతవేటు దూరంలో నీరు నిలిచి చెరువును తలపిస్తున్నా పట్టించుకోకుండా ఊరి చివర పారిశుద్ధ్య పనులు చేసినట్లు తూతూ మంత్రంగా ఫొటోలకు ఫోజులిచ్చి చేతులు దులుపుకోవడంతో చెత్త పేరుకుపోతోంది. ఆ చుట్టుపక్కల ప్రాంతాల్లో అపరిశుభ్ర వాతావరణం నెలకొంది. అధికారులు పారిశుద్ధ్యం మెరుగుకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని చెబుతున్నా... అది మాటలకే పరిమితమవుతోందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మండలంలో ఎక్కడ చూసినా చెత్త దిబ్బలు కనిపిస్తున్నాయి. దోమలు వృద్ధి చెందడంతో పాటు పందులు, కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. పల్లెలకు వచ్చే వారికి చెత్త స్వాగతం పలుకుతోంది. ఇప్పటికే రోజుకు పదుల సంఖ్యలో జ్వరాలతో ఆస్పత్రి పాలవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు మేల్కొని డ్రైనేజీల్లో పూడిక తీసి మురుగునీరు ముందుకు సాగేలా చర్యలు చేపట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

శ్రీగిరిలో భక్తిశ్రద్ధలతో శ్రీవారి ఆస్థానం

- శాస్త్రోక్తంగా శ్రవణా నక్షత్ర పూజలు



శ్రవణా నక్షత్రం పూజలో ఒంగోలు కొండమీద శ్రీగిరి వేంకటేశ్వర స్వామి దేవస్థానం అర్చకులు



ప్రత్యేక అలంకరణలో కళ్యాణ వెంకటేశ్వర స్వామి

ఒంగోలు మెట్రో: శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకుని మంగళవారం ఒంగోలు కొండమీద శ్రీగిరి వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో శ్రీవారి ఆస్థానం కార్యక్రమాన్ని భక్తి శ్రద్ధలతో సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. దేవస్థానం అర్చకులు, వేద పండితులు శ్రీవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. నాద నీరాజనం. చతుర్వేద పారాయణ, విష్ణు సహస్ర నామ పారాయణతో పాటు భారత, భాగవత, భగవద్గీత, రామాయణ శ్లోకాలను గానం చేశారు. గాయకురాలు దీప్తి అన్నమయ్య సంకీర్తనలను ఆలపించి భక్తులను అలరించారు. కార్యక్రమాలను శ్రీగిరి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ ఆలూరు ఝాన్సీ రాణి, ఆర్జిత సేవల ధర్మకర్త ఆలూరు సుశీలా దేవి, కార్యనిర్వహణ ధర్మకర్త సీవీ రామకృష్ణారావు, ధర్మకర్తలు ఆలూరు వేంకటేశ్వరరావు, ఆలూరు లక్ష్మీ కుమారి తదితరులు పర్యవేక్షించారు. శ్రీగిరి దేవస్థానం నిర్వాహకులు భక్తులకు శ్రీవారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

కళ్యాణ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో..

ఒంగోలు రంగారాయుడు చెరువు దగ్గర భూదేవి సమేత శ్రీదేవి భూదేవి సమేత కళ్యాణ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో మంగళవారం శ్రీవారి జన్మ నక్షత్రం శ్రవణా నక్షత్రం పురస్కరించుకొని ఆలయ అర్చకులు రాజేష్ స్వామివారి మూల విరాట్ కు సుగంధ పరిమళ ద్రవ్యాలతో వివిధ రకాల పండ్ల రసాలతో అభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

శోభాయమానంగా శ్రీగిరి ప్రదక్షిణ



శ్రీవారి పల్లకిని మోస్తున్న భక్తులు



వెంకటేశ్వర స్వామి శ్రీగిరి ప్రదక్షిణలో భక్తులు

ఒంగోలుమెట్రో: వెంకటేశ్వర స్వామి జన్మ నక్షత్రం శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకుని శ్రీగిరి గిరి ప్రదక్షిణ ఆధ్వర్యంలో మంగళవారం శ్రీగిరి ప్రదక్షిణ కార్యక్రమం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వందలాది మంది భక్తులు సామూహికంగా గోవింద నామాలు చదువుతూ స్వామి ఉత్సవమూర్తిని తమ భుజస్కంధాలపై మోస్తూ శ్రీగిరి చేరి శ్రీవారిని దర్శించి ఆనందంతో అవ్యక్తానుభూతి పొందారు. ఉదయం ఐదు గంటలకు శ్రీగిరి పాదపీఠం వద్ద బాపూజీ గోసంరక్షణ సంఘం గోశాల వద్ద గోపూజ నిర్వహించారు. కమిటీ అధ్యక్షులు రాధా రమణ గుప్తా జంధ్యం, కోశాధికారి వలేటి కృష్ణారావు, సభ్యులు ధనిశెట్టి రామునాయుడు, గో సంఘం వాసు, శనేగేపల్లి కిషోర్, సురేంద్ర, పి.సురేష్, కనిగెల్పుల పవన్ పాల్గొన్నారు.

కదిలిన యంత్రాంగం



కొలతలు వేస్తున్న సర్వేయర్, ఎండోమెంట్ ఈవో

సాక్షి ఎఫెక్ట్..

కొత్తపట్నం: మండలంలోని రాజు గోపాల స్వామి ఆలయం, ఆదికేశవస్వామి ఆలయం, సాగేశ్వరస్వామి ఆలయం కొలతలు కొలిచి సబ్ డివిజన్ చేయిస్తామని అధికారులు హామీ ఇచ్చారు. ఈ నెల 21న సాక్షి దినపత్రికలో సమన్వయ లోపం..ప్రజలకు శాపం అనే శీర్షికతో ప్రచురించిన కథనానికి అధికారులు స్పందించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో జరిగిన గ్రీవెన్స్‌కు కొందరు కొత్తపట్నం గ్రామస్తులు సాక్షి పేపర్ కటింగ్‌తో వెళ్లారు. అక్కడ ఏసీ పానకాలరావు, ఆర్డీవో లక్ష్మీప్రసన్నను కలిసి సమస్యను వివరించారు. రాజుగోపాల స్వామి ఆలయం, ఆదికేశవస్వామి ఆలయం, సాగేశ్వరస్వామి ఆలయం కొలతలు కొలిచి సబ్ డివిజన్ చేయిస్తామని హామీ ఇచ్చారు. అందులో భాగంగా మంగళవారం ఎండోమెంట్ ఈవో సుబ్రహ్మణ్యం, సర్వేయర్ సింగోతు బ్రహ్మయ్యలు రాజుగోపాల్ స్వామి, ఆదికేశవ స్వామి, నాగేశ్వరస్వామి ఆలయాలను సందర్శించారు. మూడు ఆలయాలు చుట్టూ కొలతలు వేశారు. ఒక్కో ఆలయానికి ఎంత భూమి ఉందని మెదర్‌మెంట్స్ తయారు చేసి ఆ వివరాలు ఏసీ పానకాలరావుకు ఇస్తామని చెప్పారు. తుది నివేదిక ఆధారంగా సమస్యను పరిష్కరిస్తామని అధికారులు పేర్కొన్నారు. కార్యక్రమంలో కోడూరి వెంకారెడ్డి, సందీప్, పురిణి సుధాకర్, పులి శ్రీను పాల్గొన్నారు.

అనీమియా లేని జిల్లాగా తీర్చిదిద్దాలి

- పౌష్టికాహార పక్షోత్సవాల ర్యాలీలో మంత్రి స్వామి



ర్యాలీలో మంత్రి స్వామి, కలెక్టర్ తమీమ్ అన్సారియా, జేసీ గోపాల కృష్ణ తదితరులు

ఒంగోలు సబర్బన్: అనీమియా (రక్తహీనత) లేని జిల్లాగా జిల్లాను తీర్చి దిద్దేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖామంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి పేర్కొన్నారు. పౌష్టికాహార పక్షోత్సవాలు (పోషణ్ పక్వాడా) ముగింపు సందర్భంగా మంగళవారం మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద నుంచి ర్యాలీ ప్రారంభించారు. కలెక్టరేట్ నుంచి బయలుదేరిన ఈ ర్యాలీ దక్షిణ బైపాస్‌లోని మిని స్టేడియం వరకు సాగింది. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ రోణంకి గోపాల క్రిష్ణ అందరిచేత ప్రతిజ్ఞ చేయించారు. మంత్రి స్వామి మాట్లాడుతూ జిల్లాలో శిశు, మాతృ మరణాలు తగ్గించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. బాల్య వివాహాలు ఎక్కువగా ఉన్నాయని, వాటిని అరికట్టాలని చెప్పారు. వీటన్నింటిని సమీకృతం చేసి రోజుకొక అంశతో ఈ నెల 8 నుంచి 22వ తేదీ వరకు పౌష్టికాహార పక్షోత్సవాలు (పోషణ్ పక్వాడా) ఘనంగా నిర్వహించుకున్నట్లు చెప్పారు. గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికల్లో అనీమియా (రక్తహీనత) లేకుండా చేయడం ఈ కార్యక్రమాల ప్రధాన ఉద్దేశమన్నారు. పిల్లల్లో మనో వికాసం పెంపొందించేలా కలెక్టరేట్‌లో జిల్లా బాలల వనరుల కేంద్రాన్ని, చంటి బిడ్డలకు తల్లులు పాలిచ్చు గదిని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా మాట్లాడుతూ జిల్లాలో తల్లిపాలపై అవగాహన, కౌన్సెలింగ్ ఇవ్వడం, సెక్రటేరియట్ స్థాయి విలేజ్ హెల్త్ శానిటేషన్ న్యూట్రిషన్‌డే నిర్వహించినట్లు చెప్పారు. ర్యాలీలో నగర మేయర్ గంగాడ సుజాత, ఐసీడీఎస్ పీడీ హేన సుజన, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ వెంకటేశ్వర రావు, డీఆర్‌డీఏ, మెప్మా పీడీలు నారాయణ, శ్రీహరి, సోషల్ వెల్ఫేర్ డీడీ లక్ష్మా నాయక్, ఐసీడీఎస్ సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

డిగ్రీ మెదటి సెమిస్టర్ ఫలితాలు విడుదల



డిగ్రీ మొదటి సెమిస్టర్ ఫలితాలు విడుదల చేస్తున్న వైస్ చాన్స్‌లర్, రిజిస్ట్రార్

ఒంగోలు సిటీ: ఆంధ్ర కేసరి యూనివర్సిటీ పరిధిలోని డిగ్రీ కళాశాల మెదటి సెమిస్టర్ పరీక్ష ఫలితాలను విడుదల చేశారు. మంగళవారం వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ డీవీఆర్ మూర్తి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బీ హరిబాబు, ఏసీఈ డాక్టర్ ఏ.భారతీదేవి మంగళవారం సాయంత్రం యూనివర్సిటీ కార్యాలయంలో విడుదల చేశారు. ఈసందర్భంగా వైస్ చాన్స్‌లర్ మాట్లాడుతూ.. డిసెంబర్– 2024లో మొదటి సెమిస్టర్ యూజీ పరీక్షలు నిర్వహించామన్నారు. భవిష్యత్‌లో విద్యార్థులు ఇంకా మంచి ఫలితాలు సాధించాలని ఆయన ఆకాభావం వ్యక్తం చేశారు. ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను ఆయన అభినందించారు. యూనివర్సిటీ అదనపు పరీక్షల నియంత్రణ అధికారిణి డాక్టర్ అంచుల భారతీదేవి మాట్లాడుతూ.. యూనివర్శిటీ పరిధిలో 88 కళాశాలల నుంచి మొత్తం 8114 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారన్నారు. వీరిలో 3956 మంది విద్యార్థులు 48.76 శాతం మేరకు ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. బీఏ హానర్స్ విభాగంలో 471 మందికి 184 మంది, బీకామ్ కంప్యూటర్ అప్లికేషన్‌లో 2703 మందికి గాను 1007 మంది, బీకాం జనరల్ విభాగంలో 104 మందికి గాను 59 మంది, వొకేషనల్ విభాగంలో 38 మందికి గాను 18 మంది, బీఎస్సీ హానర్స్ విభాగంలో 3556 మందికిగాను 2072 మంది, బీబీఏ విభాగంలో 97 మందికిగాను 25 మంది, బీసీఏ విభాగంలో 1145 మందికి 591 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు ఆమె తెలిపారు. ఈ ఫలితాలను యూనివర్శిటీ రిజల్ట్స్ లింక్ ద్వారా తెలుసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో సీడీసీ డీన్, డీవోఏ ప్రొఫెసర్ సోమశేఖర్, సీఈ డాక్టర్ కేవీఎన్ రాజు, ఏసీఈ డాక్టర్ అంచు భారతీ దేవి, డాక్టర్ ఎస్.సురేష్ సిబ్బంది పాల్గొన్నారు.

అంబేడ్కర్ నాటకం పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు సబర్బన్: అంబేడ్కర్ నాటకం పోస్టర్‌ను కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆవిష్కరించారు. ప్రకాశం భవన్‌లోని తన చాంబర్‌లో మంగళవారం ఆమె పోస్టర్‌ను ఆవిష్కరించారు. కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) సామాజిక చైతన్య సాంస్కతిక ఉత్సవాలు–2025లో భాగంగా పోస్టర్‌ను రూపొందించారు. ఆధునిక రంగస్థలం అరుగుపై డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జీవిత చిత్రం, కళారూపకం (నాటకం) మే 8న ఒంగోలు అంబేడ్కర్ భవనంలో ప్రదర్శించనున్నారు. మే 9న మద్దిపాడు నటరాజ కళాక్షేత్రం పంచాయతీ ఆఫీస్ దగ్గర జరిగే నాటకాలను జయప్రదం చేయాలని నిర్వాహకులు కోరారు. ఈ సందర్భంగా కేవీపీఎస్ నాయకులు మాట్లాడుతూ అట్టడుగు వర్గంలో పుట్టిన అంబేడ్కర్ సమాజంలోని అన్ని వర్గాలకు మేలు చేసే విధంగా రాజ్యాంగాన్ని రూపకల్పన చేశారని, అంబేడ్కర్ కొందరివాడు కాదని, అందరివాడని కొనియాడారు. కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి రఘురామ్, ఉపాధ్యక్షుడు వేసపోగు మోజేష్, జె.సంజీవరావు పాల్గొన్నారు.

నూతన కమిటీ సభ్యులకు అభినందన



పార్టీ పదవులు వచ్చిన వారిని అభినందిస్తున్న మాజీ మంత్రి మేరుగు నాగార్జున

మద్దిపాడు: ఇటీవల మండల స్థాయిలో ఏర్పాటు చేసిన వైఎస్సార్ సీపీ అనుబంధ కమిటీల్లో ఎంపికైన వారిని సంతనూతలపాడు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్, మాజీ మంత్రి మేరుగు నాగార్జున అభినందించారు. పార్టీ మండల ఉపాధ్యక్షుడిగా మండల బాలచంద్రమౌళి, ఎస్సీ సెల్ అధ్యక్షునిగా రాయపాటి విల్సన్, మండల మహిళా విభాగం అధ్యక్షురాలిగా పీ సంధ్య, అంగన్‌వాడీ విభాగానికి నాగమల్లేశ్వరి, పబ్లిసిటీ వింగ్ అధ్యక్షునిగా గద్దె జాలయ్య ఎంపికైన నేపథ్యంలో మంగళవారం మద్దిపాడు వద్ద ఉన్న సంతనూతలపాడు నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో ఉన్న మేరుగు నాగార్జునను వారు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ క్రమంలో ఆయన పార్టీలో కష్టపడి పనిచేసే వారికి పదవులు దక్కుతాయని చెప్పారు. పార్టీని బలోపేతం చేసేలా తాము కృషి చేస్తామని ఈ సందర్భంగా వారు తెలిపారు. కార్యక్రమంలో వారి వెంట మండల పార్టీ ఉపాధ్యక్షుడు వాకా కోటిరెడ్డి, వైస్ ఎంపీపీ పైడిపాటి వెంకటరావు, రామాంజనేయులు, నాదెండ్ల మహేష్, తదితర పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు పనిదినాలు పెంచాలి



మాట్లాడుతున్న ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీడీ బసవ సుబ్బారావు



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న నెరుసుల వెంకటేశ్వర్లు

సంతనూతలపాడు: అన్ని గ్రామాల్లో ఉపాధి హామీ కూలీలకు సక్రమంగా పని దినాలు కల్పించాలని ఉపాధి ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీడీ బి.బసవ సుబ్బారావు పేర్కొన్నారు. సంతనూతలపాడు మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం సంతనూతలపాడు, చీమకుర్తి మండలాల ఎన్‌ఆర్‌ఈజీఎస్ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఏపీవో వాసంతి అధ్యక్షత వహించారు. 6500 మంది కూలీలకు పని కల్పించడం లక్ష్యం కాగా సంతనూతలపాడు చీమకుర్తి మండలంలో 4700 మంది కూలీలు పనిచేస్తున్నారని అన్నారు. లక్ష్యం మేరకు ఆయా మండలాల్లో జరిగే ఉపాధి కూలీల పని దినాలు సంఖ్యను పెంచాలని అన్నారు. అదేవిధంగా రైతు వారి కుంటలు, ఇంకుడు గుంటలు, పశువుల నీటి తొట్టెలు నిర్మాణాల ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. చీమకుర్తి మండల ఏపీవో రాఘవ రాజు చీమకుర్తి ఈసీ ప్రవీణ్, క్లస్టర్ ప్లాంటేషన్ సూపర్‌వైజర్ శ్రీనివాస్ రెడ్డి, సంతనూతలపాడు, చీమకుర్తి మండలాల టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఉపాధి కూలీల బకాయిలు వెంటనే విడుదల చేయాలి

సంతనూతలపాడు: ఉపాధి కూలీల బకాయిలను వెంటనే విడుదల చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు నెరుసుల వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలోని మద్దులూరు గ్రామంలో మంగళవారం ఉపాధి పనుల దగ్గరకు వెళ్లి అక్కడ కూలీలతో మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వారు 13 వారాల నుంచి ఉపాధి వేతనాలు ఇవ్వలేదని ఇన్ని రోజులు డబ్బులు ఇవ్వకపోతే ఉపాధి కూలీలు ఎలా బతకాలని వెంకటేశ్వర్లు ప్రశ్నించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు అన్నవరపు శేషారావు, నాగూరు, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

లేబర్ కోడ్ అమలుకు దొడ్డిదారి యత్నాలు



విస్తృత స్థాయి సమావేశంలో మాట్లాడుతున్న ఉమామహేశ్వరరావు

ఒంగోలు టౌన్:

కార్పొరేట్లకు అనుకూలంగా తీసుకొచ్చిన లేబర్ కోడ్లను దొడ్డిదారిన ప్రవేశ పెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు ఆరోపించారు. కార్మికులందరూ ఐక్యపోరాటాల ద్వారా కేంద్ర ప్రభుత్వం చేస్తున్న కుట్రలను బలంగా తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. మంగళవారం సీఐటీయూ కార్యాలయంలో జరిగిన జిల్లా విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. పెట్టుబడిదారులకు అత్యధిక లాభాలను తెచ్చి పెట్టే విధంగా లేబర్ కోడ్లను తీసుకొచ్చి కార్మికులపై బలవంతంగా రుద్దే కుట్రలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. 29 కార్మిక చట్టాలను 2019లో, వేతనాలకు సంబంధించిన కోడ్‌ను 2020లో, పారిశ్రామిక సంబంధాలు, సామాజిక భద్రత కోడ్లను, వృత్తి భద్రత, ఆరోగ్య పని పరిస్థితులు అనే మూడు కోడ్లను తీసుకొని వచ్చిందని తెలిపారు.అంబానీ, అదానీలకు లాభాలు తెచ్చే పెట్టే విధంగానే లేబర్ కోడ్లను తీసుకొచ్చారని విమర్శించారు. పాత కార్మిక చట్టాలన్నిటినీ పిండి సారం లేని పిప్పిని కార్మికుల ముందుంచిందన్నారు. 2025లో ఏ క్షణంలోనైనా లేబర్ కోడ్లను అమలు చేసేందుకు సంసిద్ధంగా ఉందని చెప్పారు. దీన్ని అడ్డుకునేందుకు కార్మిక వర్గం పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందని చెప్పారు. లేబర్ కోడ్‌ను రద్దు చేయాలని కోరుతూ మే 20వ తేదీన దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెకు కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయని, ప్రతి ఒక్కరూ సమ్మెలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కాలం సుబ్బారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో పి.కల్పన, ఎం.రమేష్, గంటెనపల్లి శ్రీనివాసులు, జీవీ కొండారెడ్డి, టి.మహేష్ పాల్గొన్నారు.

కిల్కారి సేవలు సద్వినియోగం చేసుకోవాలి

- డీఎంహెచ్‌ఓ డాక్టర్ వెంకటేశ్వర్లు

ఒంగోలు టౌన్: కిల్కారి సేవలను గర్భిణులు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ టి. వెంకటేశ్వర్లు చెప్పారు. మంగళవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలోని మీటింగ్ హాలులో మార్కాపురం డివిజన్ ఆషా నోడల్ ఆఫీసర్లకు కిల్కారిలో శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన కిల్కారి కాల్ సేవలు గర్భిణి 4వ నెల నుంచి మొదలుకొని బిడ్డ ఏడాది వయసు వచ్చే వరకు వస్తుంటాయని తెలిపారు. కల్కారి కాల్ నంబర్ 01244451660 ను మొబైల్‌లో సేవ్ చేసుకుంటే వారానికి ఒకసారి కాల్స్ వస్తుంటాయని తెలిపారు. కార్యక్రమంలో కిల్కారి ప్రోగ్రాం ఆఫీసర్ రాజు, డీపీహెచ్‌ఎన్‌ఓ సుగుణమ్మ, డీసీఎం రాజేశ్వరి పాల్గొన్నారు.

విద్యార్థుల విజయంలో ఉపాధ్యాయులు కీలకం

ఒంగోలు సిటీ: విద్యార్థులు ఎదుర్కొనే పరీక్షల్లో విజయం సాధించడంలో కలిగే ఒత్తిడిలను అధిగమించే విధంగా ఉపాధ్యాయులు మార్గనిర్దేశం చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఏ.కిరణ్‌కుమార్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ప్రకాశం భవనంలోని పీజీఆర్‌ఎస్ హాలులో కమిషన్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ చైల్డ్ రైట్స్ నిర్వహించిన 'పరీక్ష పర్వ్ 7.0 వర్క్ షాప్'ను ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా డీఈవో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులును ఉద్దేశించి డీఈవో మాట్లాడారు. జిల్లా విద్యా శిక్షణ సంస్థ ప్రిన్సిపాల్ సామా సుబ్బారావు మాట్లాడుతూ తల్లిదండ్రులు విద్యార్థులకు మొదటి పేరెంట్ అయితే, ఉపాధ్యాయులు రెండో పేరెంట్ అని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి టి రమేష్, ఎం రమేష్ ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.